E-KABURU

epaper

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

03-3-2025 సోమవారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com



చంద్రుడి పై అడుగుపెట్టిన బ్లూ ఘోస్ట్..

2లో



## మేడిగడ్డ ప్రమాదం కుట్రపూరితం:కేటీఆర్

**ఈ-కబురు, రాజన్న సిరిసిల్ల జిల్లా:** ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తాండాలో సాగు నీరందక ఎండిపోతున్న పంటలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ ఉన్నప్పుడు కాళేశ్వరం నుంచి నీళ్లు వస్తాయన్న ఆశతో వరి పంట వేసుకున్నారు. కేసీఆర్‌పై కోపంతో కాళేశ్వరం నుంచి కుట్రపూరితంగా రేవంత్ నీళ్లు ఇవ్వకుండా చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు.

"దేవునిగుట్ట తండాలో వరి నాట్లు వేసుకున్నారు. రుణమాఫీ కాలేదు, రైతుబంధు రాలేదు. కాలం తెచ్చిన కరువు కాదిది.. రేవంత్ తెచ్చిన కరువు. గత ప్రభుత్వంలో అప్పర్ మానేర్ నింపి ఎర్రటి ఎండలో నీళ్లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని రైతులకు సాగునీరు ఇచ్చి ఆదుకోవాలి. మల్కపేట రిజర్వాయర్‌కు నీళ్లు విడుదల చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి. ఒక వేళ నీళ్లు ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతాం" అని కేటీఆర్ హెచ్చరించారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలపై హరీశ్రావు స్ట్రాంగ్ కౌంటర్



నిజాయితీ ఉంటే ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై విచారణ జరిపించు.. సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సవాలు మీ రాజకీయ ప్రయోజనాల కోసం సాంకేతికపరమైన విషయాలు నిర్లక్ష్యం చేసి ఆదరబాదరగా ఎస్ఎల్బీసీ పనులు పరిగెత్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కార్మికులు వద్దని వారిస్తున్నా వినకుండా వారిని మృత్యు కుహరంలోకి నెట్టారు. వారి ప్రాణాలు బలితీసుకొని ఇప్పుడు కుహనా ఏడ్పులు ఏడుస్తున్నారని మండిపడ్డారు. నీకు నిజాయితీ ఉంటే ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు! దోషులు ఎవరో తేల్చు అని హరీశ్‌రావు సవాలు విసిరారు. పచ్చి అబద్ధాలు, పిచ్చి సెంటిమెంట్లు నోటికి వచ్చినట్టు కారు పూతలు బంద్ చెయ్ అని మండిపడ్డారు. ఒర్రితే పనులు కావు ఒళ్ళు వంచి పని చేస్తే పనులవుతాయని స్పష్టం చేశారు.

# అవసరమైతే రోబోల సాయం తీసుకోండి

## ఎల్ఎల్బీసీ ప్రమాదానికి గత పాలకులే కారణం

- జాతీయ స్థాయిలో నిపుణులైన సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు సహాయక చర్యల్లో
- పాలుపంచుకుంటున్నాయి
- సొరంగంలో గల్లంతైన వారి కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి
- ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండుమూడ్రోజుల సమయం పడుతుంది
- టన్నెల్లోకి వెళ్లి స్వయంగా సహాయక
- చర్యలను పరిశీలించిన సీఎం

2లో



ఎలాంటి ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

**దోమలపెంట:** ఎలాంటి ప్రాణ నష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతో పాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సొరంగంలో 8మంది గల్లంతైన నేపథ్యంలో సహాయకచర్యలను సీఎం, మంత్రులు టన్నెల్‌లోకి వెళ్లి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు.



ఫిబ్రవరి 22న ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం 8 మంది గల్లంతు... ఇప్పటికీ తెలియరాని ఆచూకీ గత 9 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు

## తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి?

**వనపర్తి తనకు చదువుతో పాటు సంస్కారం నేర్పించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు.**



**ఈ-కబురు, వనపర్తి:** "గతంలో వనపర్తి రాజకీయాల్లో కక్షలు, ధన ప్రభావం ఉండేది కాదు. ఐదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారు. కేసీఆర్ పదేళ్లు తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. మోదీ 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్నారు. తెలంగాణకు భాజపా, భారాస ఏం చేశాయి? ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ జరిగిందా? లేదా? చెప్పాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. భారాస, భాజపా నాయకుల తప్పుడు ప్రచారాన్ని రైతులు తిప్పికొట్టాలి. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నా ఎక్కడైనా కోతలు విధించామా? రూ.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామా?లేదా? మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నాం. 65 లక్షల మంది మహిళలు స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. సభ్యుల సంఖ్య కోటికి చేర్చాలని ప్రయత్నిస్తున్నాం. కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలని కృషి చేస్తున్నాం.

**ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే మరో 15..20 ఏళ్లు సీఎంగా..**

ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్‌రెడ్డి మరో 15..20ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటే.. తమ బతుకు బస్టాండ్ అవుతుందని భాజపా, భారాస నేతలు భయపడుతున్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పండబెట్టారని భారాస నేతలను అడుగుతున్నా. కృష్ణా జలాలను ఏపీ సర్కారు రాయలసీమకు కొల్లగొట్టుకు పోతుందంటే అందుకు కారణం కేసీఆర్. 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఆంధ్రాకు తీసుకెళ్లండని కేసీఆర్

తరువాయి 2లో



**అమెరికాలో అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయి: ట్రంప్**

2లో

**బ్లాక్‌మెయిల్ చేయడం నా రక్తంలోనే లేదు డీకే శివకుమార్**


## సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి చురకలు



వరంగల్‌లోని మామునూరు ఎయిర్ పోర్ట్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత రెడ్డి చేస్తున్న ప్రకటనలపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తనదైన శైలిలో స్పందించారు. విమానాశ్రయాలను నిర్మించేది రాష్ట్ర ప్రభుత్వాలు కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి చురకలంటించారు.

2లో

**న్యూజిలాండ్‌పై భారత్ విజయం..**



6లో

# తెలంగాణకు భారాస, భాజపా ఏం చేశాయి?



**మొదటి పేజీ తరువాయి**

సంతకం పెట్టారు. ఆ సంతకమే ఇవాళ తెలంగాణ రైతాంగానికి శాపంగా మారింది. ఎస్‌ఎల్‌బీసీ పాపాల భైరవుడు కేసీఆర్ కాదా? పదేళ్లు భారాస పాలనలో ఎస్‌ఎల్‌బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలింది. టన్నెల్‌లో 8మంది ప్రాణాలు పోవడానికి కారణం కేసీఆర్. కేసీఆర్‌ను నమ్మినందుకే పాలమూరు పడావు పడింది. అప్పుడే నన్ను దిగు.. దిగు అని కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అంటున్నారు. పాలమూరు రైతు బిడ్డ సీఎం అయితే చూసి ఓర్వలేరా? కేసీఆర్.. మీరు ఏలడానికి పుడితే.. మేం బిచ్చమెత్తుకునేందుకు పుట్టామా? పాలమూరు ప్రజలకు తెలివితేటలు లేవా? మీ మాదిరిగా మేం చదువుకోలేదా?

**కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు**

మామునూరు ఎయిర్ పోర్టు ప్రధాని మోదీ ఇచ్చారు.. నేనే తెచ్చానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారు. అదే నిజమైతే.. మెట్రో రాలేదు, ఆపింది మోదీనే కదా? మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు.. ఆపింది మోదీనే కదా?. రీజినల్‌రింగ్ రోడ్డు ఉత్తరభాగం నేనే తెచ్చానని కిషన్‌రెడ్డి చెబుతున్నారు. దక్షిణ భాగం ఆగిపోయింది. ఆపింది మీరే కదా? పాలమూరు రంగారెడ్డికి 60 టీఎంసీల నీటి కేటాయింపులు పదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. ఆపింది మీరు కాదా? వస్తేనేమో ఆయన ఖాతాలో రాసుకుంటారు.. రాకపోతేనే రేవంత్‌రెడ్డి ఏం చేయలేదంటారు. సికింద్రాబాద్‌లో వరద బాధితులకు కిషన్‌రెడ్డి ఏం చేశారు. నా కంటే చిన్నోడు రాష్ట్రానికి సీఎం అయ్యిండని కిషన్‌రెడ్డికి కడుపు మంట. కిషన్‌రెడ్డీ.. మీ దగ్గర మోదీ, ఈడీ, సీబీఐ ఉండొచ్చు. ఎంతకాలం ఈడీ, సీబీఐని చూపించి బెదిరిస్తారు? మేం ఎవరికీ భయపడం. మోదీ మనకు ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలోనే ఉన్నారు. మోదీ చేయాలనుకున్నా.. కిషన్‌రెడ్డి సైంధవుడిలా అడ్డు పడుతున్నారు. తన రహస్య మిత్రుడు దిగిపోయాడని కిషన్‌రెడ్డి బాధపడుతున్నారు.'' అని సీఎం ప్రశ్నించారు.





# అవసరమైతే రోబోల సాయం తీసుకోండి

**మొదటి పేజీ తరువాయి**

''ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను 200506లో ప్రారంభించారు. 2014 తెలంగాణ ఏర్పడే నాటికి 32 కిలోమీటర్ల టన్నెల్ పూర్తయింది. కానీ, గత పదేళ్లుగా భారాస ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీని పట్టించుకోలేదు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేశారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రాజెక్టును పూర్తి చేయాలని.. ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించాం. టన్నెల్ బోరింగ్ మిషన్‌కు కావాల్సిన విడి భాగాలను అమెరికా నుంచి తెప్పించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకున్నాం. కానీ, అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది.

ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం కాదు.. బాధిత కుటుంబాలను ఆదుకోవాలి. విపత్తు సమయంలో జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయి. గల్లంతైన 8మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియలేదు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు.. మూడ్రోజుల సమయం పడుతుందని అధికారుల సమీక్షలో తేలింది. కన్వేయర్ బెల్ట్ పాడవటం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడింది. రేపు సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. మట్టి తీసిన తర్వాత మిషన్ తొలగించి, గల్లంతైన వారిని గుర్తించాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రమాదంపై రాజకీయం చేయడం తగదు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలి. మనోధైర్యం కోల్పోలేదు.. మరింత పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. టన్నెల్ పనుల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకూడదనే ఉద్దేశంతో మనుషులు మిషిన్లతో పాటు అవసరమైతే రోబోలను వినియోగించాలని అధికారులను ఆదేశించా'' అని సీఎం తెలిపారు.

**విపక్షాలు బురద రాజకీయం చేస్తున్నాయి..**

''ఈ ఘటనలో ప్రభుత్వ నిర్లక్ష్యం, లోపం ఎక్కడైనా ఉందా? దురదృష్టకర ఘటనపై విపక్షాలు బురద రాజకీయం చేస్తున్నాయి. గతంలో శ్రీశైలం పవర్‌ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు చనిపోయారు. పీసీసీ అధ్యక్షుడిగా నేను ఆ ప్రమాద స్థలికి వెళ్దామంటే అనుమతించలేదు. దేవాదులలో 9మంది గల్లంతు అయితే ఐదేళ్ల తర్వాత అస్తిపంజరాలు దొరికాయి. మేడిగడ్డ నష్టానికి, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కుంగిన ఘటనకు తేడా ఉంది. మేడిగడ్డ ప్రాజెక్టు నష్టం.. నిర్లక్ష్యం, నాణ్యతాలోపం వల్ల జరిగింది. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన విపత్తు లాంటిది. ఘటన జరిగిన వెంటనే హరీశ్‌రావు ఎందుకు రాలేదు. ఈ ప్రమాదం తర్వాత హరీశ్‌రావు రెండ్రోజులు అబుదాబిలో దావత్ చేసుకున్నారు'' అని సీఎం వివర్శించారు.



# చంద్రుడి పై అడుగుపెట్టిన బ్లూ ఘోస్ట్..

**ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్' అనే ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది.**

అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. ఈ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్ ' అనే వ్యోమనౌక జాబిల్లి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఫైర్‌ఫ్లైకు చెందిన మిషన్ కంట్రోల్ ఈ విషయాన్ని నిర్ధరించింది. 'చంద్రుడిపై ఉన్నాం. ల్యాండర్ స్థిరమైన స్థితిలో ఉంది' అని ప్రకటించింది. తద్వారా చందమామపై కూలిపోకుండా, పడిపోకుండా.. సరైన స్థితిలో వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రైవేటు సంస్థగా నిలిచింది.

ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి జనవరి 15న స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్ 9 రాకెట్.. బ్లూ ఘోస్ట్‌తోపాటు జపాన్‌కు చెందిన మరో ల్యాండర్ 'హకుటోఆర్2'ను నింగిలోకి తీసుకెళ్లింది. బ్లూ ఘోస్ట్ ల్యాండర్ పొడవు రెండు మీటర్లు. ఇది జాబిల్లి కక్ష్య నుంచి ఆటోపైలట్ మోడ్‌లో కిందికి ప్రయాణిస్తూ.. ఈశాన్య అంచున ఉన్న మోన్స్ లాట్రెయిల్ సమీపంలో దిగింది. తొలి ఫొటోను పంపించింది. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు సంబంధించిన 10 ప్రయోగాలను నిర్వహించనుంది. చందమామ ధూళిని సేకరించేందుకు వాక్యూమ్ వినియోగం, చంద్రుడి ఉపరితలం కింద ఉష్ణోగ్రతలను కొలవడానికి డ్రిల్లింగ్ చేయడం, వ్యోమగాముల స్పేస్‌సూట్‌లు, పరికరాలకు అంటుకునే హానికరమైన ధూళిని తొలగించే మరో పరికరాన్ని పరీక్షించడం తదితరాలు ఇందులో ఉన్నాయి.

అమెరికాలో అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయి: ట్రంప్

టెక్సాస్‌కు చెందిన 'ఇన్‌ట్యూయిటివ్ మెషీన్స్' సంస్థ ప్రయోగించిన ల్యాండర్ కూడా గురువారం జాబిల్లిపై దిగేందుకు సిద్ధంగా ఉంది. దక్షిణ ధ్రువానికి 160 కిలోమీటర్ల దూరంలో దీన్ని దించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది ఇదే సంస్థ ప్రయోగించిన మొదటి ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై ఒరిగిపోయింది. మరోవైపు.. బ్లూ ఘోస్ట్‌తోపాటే నింగిలోకి వెళ్లిన 'హకుటోఆర్2'.. మే చివర్లో లేదా జూన్ మొదట్లో దిగనుంది. జాబిల్లిపై ల్యాండింగ్ కోసం ఐస్పేస్ చేస్తున్న రెండో ప్రయత్నమిది. రెండేళ్ల కిందట ప్రయోగించిన మొదటి ల్యాండర్ చందమామ ఉపరితలంపై కూలిపోయింది.



## బ్లాక్‌మెయిల్ చేయడం నా రక్తం లోనే లేదు డీకే శివకుమార్

కాంగ్రెస్‌పై, గాంధీ కుటుంబం పట్ల తనకున్న నిబద్ధతను ఎవరైనా ప్రశ్నిస్తే అది వారి భ్రమే అవుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు . పార్టీ మారుతారని వస్తోన్న ఊహాగానాలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి స్పందించారు. తాను కాంగ్రెస్‌కు నమ్మకమైన కార్యకర్తనని, పార్టీపై, గాంధీ కుటుంబం పట్ల తనకున్న నిబద్ధతను ఎవరైనా ప్రశ్నిస్తే అది వారి భ్రమే అవుతుందన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

''ఎవ్వరికీ ఎలాంటి షరతులు పెట్టలేదు. అటువంటి షరతులు పెట్టాల్సిన అవసరం లేదు. నేనో నమ్మకమైన కార్యకర్తను. పార్టీ ఏం చెబితే దాని ప్రకారం నడుచుకుంటా. కండీషన్లు పెట్టడం, బ్లాక్‌మెయిల్ చేయడం నా రక్తంలోనే లేదు'' అని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఇటీవల దిల్లీ పర్యటనలో భాగంగా అధిష్ఠానానికి కొన్ని షరతులు విధించారని వస్తోన్న వార్తలకు డీకే ఈ విధంగా స్పందించారు. ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా.. పార్టీపై, గాంధీ కుటుంబం పట్ల నా నిబద్ధతను ప్రశ్నిస్తే అది వారి భ్రమే అవుతుందన్నారు. 2.5ఏళ్లు సీఎం ఫార్ములా అవాస్తవమా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. 2028లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మాత్రమే చెప్పగలనని అన్నారు.

**నా కుమార్తెకు పోకిరీల వేధింపులు - కేంద్ర మంత్రి ఖడ్సే**

కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీకి.. ముఖ్యమంత్రి ఎంపిక విషయం సవాలుగా మారింది. సిద్ధరామయ్య, డీకేఎస్ మధ్య తీవ్ర పోటీ నెలకొనడమే అందుకు కారణమైంది. తీవ్ర కసరత్తు అనంతరం సిద్ధరామయ్యకు సీఎం, శివకుమార్‌కు ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించింది. అయితే, చెరో రెండున్నరేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు ఇరువురు నేతలు అంగీకరించారనే వార్తలు అప్పట్లో వచ్చాయి. దానిపై పార్టీ నుంచి ఎటువంటి సమాచారం లేనప్పటికీ.. ఇప్పటికీ ఈ వాదన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా కొనసాగుతూనే ఉంది.

# సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి చురకలు

**హైదరాబాద్, మార్చి 02:** వరంగల్‌లోని మామునూరులో ఎయిర్ పోర్ట్ క్లియరెన్స్‌కు కేంద్రం పచ్చ జెండా ఊపింది. ఈ నేపథ్యంలో ఆ క్రెడిట్ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానిదేనంటూ ఆ పార్టీ అగ్రనేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాంటి వేళ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ఆదివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన చురకలంటించారు. తెలంగాణ సీఎం రేవంత రెడ్డి కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు ఉన్నారన్నారు.

ఎయిర్ పోర్టులు నిర్మించేది ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అని గుర్తు చేశారు. అంతేకాని రాష్ట్రప్రభుత్వాలు కాదంటూ చురకలంటించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం భూసేకరణ మాత్రమే చేస్తుందని ఆయన వివరించారు. మీరు అధికారంలోకి వచ్చే నాటికీ తెలంగాణ రాష్ట్రం సర్ ప్లస్ (నిధులు మిగులు) రాష్ట్రంగా ఉందని.. కానీ నేడు అదే రాష్ట్రం అప్పుల పాలు ఎలా అయిందో జవాబు చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ప్రజలకు చెప్పి.. వాటిని అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆగం చేశాయంటూ మండిపడ్డారు.

తాము మాట ఇచ్చామని.. అందుకు అనుగుణంగా వరంగల్ ఎయిర్ పోర్ట్‌ను ఇస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. అందుకోసం ఎంత తొందరగా భూసేకరణ చేస్తారో చూస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సవాల్ విసిరారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం, రామగుండం, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఇక ఆ యా ప్రాంతాల్లో భౌగోళిక పరంగా సాధ్యాసాధ్యాలపై తమ టెక్నీకల్ టీం సర్వే చేస్తుందన్నారు.

మామునూరులోఎయిర్ పోర్టు ఏర్పాటుకు కేంద్రం శనివారం అంటే.. మార్చి 1వ తేదీన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో దీనిపై సీఎం రేవంత్ రెడ్డి తన నివాసంలో ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు మామునూరులో ఎయిర్ పోర్ట్ వద్ద కాంగ్రెస్, బీజేపీ కేడర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది.

ఈ ఎయిర్ పోర్ట్ ఘనత తమదంటే తమదంటూ ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి పుష్పాభిషేకం చేసేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నించాయి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీల చిత్ర పటాలతో కూడిన ఫ్లెక్సీలతో మామునూరు ఎయిర్ పోర్ట్ వద్దకు చేరుకుని బిగ్గరగా నినాదాలు చేపట్టారు. వారి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రయత్నించాయి. వారి ప్రయత్నాన్ని బీజేపీ శ్రేణులు అడ్డుకున్నాయి.

ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను శాంతింప చేశారు. ఇక రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం ఇదే తరహాలో వ్యవహరించడంతో .. కేంద్ర మంత్రిపై విధంగా స్పందించారు. అంతేకాదు.. ఎయిర్ పోర్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మించదని.. ఎయిర్ పోర్టు ఆథారిటి ఆఫ్ ఇండియా నిర్మిస్తుందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

# అమెరికాలో అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయి: ట్రంప్

**తాను రెండోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన చర్యల వల్ల దేశంలోకి అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.**



తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికామెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అక్రమ వలసదారులను ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక విమానాల్లో వారి స్వదేశాలకు తిరిగి పంపిన విషయం తెలిసిందే. తాను విధించిన కఠినమైన ఇమిగ్రేషన్ విధానాలతో ఫిబ్రవరిలో అక్రమ వలసల సంఖ్య చరిత్రలోనే అతి తక్కువ స్థాయికి చేరాయని ట్రంప్ వెల్లడించారు. ఇంతటితో అమెరికాపై అక్రమ వలసదారుల దండయాత్ర ముగిసిందని అభివర్ణించారు.

ఫిబ్రవరిలో కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే దేశ సరిహద్దుల్లో పట్టుబడ్డారని ట్రంప్ పేర్కొన్నారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా దేశంలోకి మూడు లక్షలమంది అక్రమంగా ప్రవేశించేవారని గుర్తు చేశారు. ఈ గణాంకాలకు సంబంధించి సీబీపీ విడుదల చేసిన నివేదికలను ఉటంకించారు. దాదాపు 95 శాతం వలసలు తగ్గినట్లు వెల్లడించారు. తన పాలనలో ఎవరైనా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు, తక్షణ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**దేశాధినేతలకు ఆగ్రహం వస్తే.. చరిత్రపై చెరగని ముద్రవేసిన మాటల యుద్ధాలివి**

ట్రంప్ ప్రకటనను పలు వార్తా సంస్థలు తప్పుబట్టాయి. ఆయన చూపిన గణాంకాలు ప్రజలను తప్పుw దోవ పట్టించే విధంగా ఉన్నాయని దుయ్యబట్టాయి. అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన డేటాను ఫాక్స్ న్యూస్ పంచుకుంది. బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో దాదాపు 20,086 మంది అక్రమ వలసదారులను గుర్తించినట్లు పేర్కొంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి వారంలో 7,287 మంది పట్టుబడ్డారని వెల్లడించింది. అయితే అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఈ సంఖ్యలో గణనీయమైన తగ్గుదల అనటం నిజం కాదని.. కేవలం 65శాతం మాత్రమే తగ్గాయని తెలియజేసింది.

రెండోసారి అమెరికా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. కఠిన నిర్ణయాలతో వారిని దేశం నుంచి సాగనంపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల్ని సైనిక విమానాల్లో వెనక్కి పంపించారు. భారత్ కూడా ఆ చర్యలకు మద్దతు పలికింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఎందుకంటే అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని స్పష్టం చేసింది.

# వనపర్తి వెంకన్న ఆలయంలో సీఎం రేవంత్ పూజలు

**తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తిలో పర్యటించారు.**

**వనపర్తి, కొత్తకోట రూరల్:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తిలో పర్యటించారు. దీనిలో స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలులు నిర్వహించారు. సీఎంకు వేదపండితులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

అనంతరం వనపర్తి జీజీహెచ్ భవన నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం, జెప్స్(బాలుర) పాఠశాల, జూనియర్ కాలేజీ భవనాలు, వనపర్తి ఐటీ టవర్, శ్రీ రంగాపురం దేవాలయం పనులు, పెబ్బేరు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం, రాజానగరం పెద్దమందడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, సీసీఆర్ రోడ్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.



# కిక్కిరిసిన గచ్చిబౌలి స్టేడియం...

## ముగిసిన విజ్ఞాన్ వైభవ్- 2025

**యుద్ధ ట్యాంకులు, మిస్సైల్స్ చూసేందుకు ఆసక్తి చూపిన నగర ప్రజలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియం ఆదివారం కిక్కిరిసింది. భారత రక్షణ రంగ శక్తిసామర్థ్యాలను సామాన్యులకు తెలియజేసే విధంగా గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఆయుధాల ప్రదర్శనను తిలకించేందుకు నగర ప్రజలు బారులు తీరారు. మన రక్షణ శాఖ అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక క్షిపణులు, రాకెట్ లాంచర్లు, యుద్ధ ట్యాంకులు, వార్ హెడ్లు, డ్రోన్లను చూసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విజ్ఞాన్ వైభవ్2025 ప్రదర్శన ఆదివారం ముగిసింది. శుక్రవారం భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఈ ప్రదర్శన శని, ఆదివారాలు సాధారణ సందర్శకుల కోసం అందుబాటులో ఉంచగా, నగర ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు తమ చిన్నారులతో కలిసి కుటుంబసమేతంగా ప్రదర్శనకు వచ్చి ఇక్కడ ఏర్పాటు చేసిన రక్షణ పరికరాలను చూశారు. నగరంలో మొదటిసారిగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో భారత త్రివిధ దళాలు ఉపయోగించే అత్యాధునిక ఆయుధ సామాగ్రిని ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 220 స్టాళ్లను ఏర్పాటు చేసి రక్షణ రంగ ఉత్పత్తులు, టెక్నాలజీలను, ఆయుధాలు, విడిభాగాలను, ఎయిర్ ఫోర్స్ టెక్నాలజీ, ఫ్లయింగ్ క్లాత్స్ ప్రదర్శనకు ఉంచారు. డిఆర్డిఎల్, డిఆర్డిఓ, ఇస్రో, మిధాని, బీడిఎల్, బిఈఎల్. ఈసిఐఎల్లు రూపొందించిన ఆయుధాలు, స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఆయుధ సామాగ్రిని స్టాళ్లలో ఏర్పాటు చేశారు. అగ్ని, బ్రహ్మోస్, ఆకాష్, ప్రళయ్ వంటి బాలిస్టిక్ క్షిపణులు ప్రదర్శనకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. త్వరలో మన భద్రతాదళాల చేతికి చేరనున్న మ్యాన్ పోర్టబుల్ యాంటీ ట్యాంక్, ఎంపిఏటిజిఎం మిస్సైల్స్ వివరాలను అధికారులు సందర్శకులకు వివరించారు. పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే డక్ట్ డిఫ్యూజర్, గాలిలో నుంచి భూమి మీదకు ప్రయోగించే రుద్రం మిస్సైల్, ఫైరింగ్ రేంజ్ లో వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్న ఆర్టిలరీ గన్ సిస్టం, శత్రువుల హెలికాప్టర్లు, ఎయిర్ క్రాఫ్టు, యుఏవిలను కూల్చివేసే క్యూఆర్ఎస్ఎం మిస్సైల్స్, భూమి మీద, నీటిలో ప్రయాణించే వీల్ యుద్ధ ట్యాంకులు, అర్జున్ యుద్ధ ట్యాంకులు, డ్రోన్ ఫైరింగ్ గన్లను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించారు.



wప్రదర్శనలో ఉంచిన ప్రళయ్ క్షిపణులు



డిఆర్ డిఓ అభివృద్ధి చేసిన ఆకాష్ మిస్సైల్స్








వైద్య శిబిరంలో స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉచిత మెగా వైద్య శిబిరం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని చందానగర్ డివిజన్ దీప్తి శ్రీనగర్ లో ఆదివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీప్తిశ్రీ నగర్ పార్కులో గల హెల్త్ కేర్ సెంటర్ లో చందానగర్ మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్, పల్స్, ఈ.సీ.జీ. బీఎండీ(ఆర్థో)కు సంబందించిన పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఆదిత్య (జనరల్ ఫిజిషియన్), డాక్టర్ సలీం (కౌ డెంటల్), డాక్టర్ నిసార్, డాక్టర్ విజన్ ఐ కేర్ వైద్యులు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల కారణంగా ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరు నిత్యం వ్యాయామం, యోగ, ధ్యానము, నడక, కనీసం 40 నిమిషాలు చేయాలని, సాధ్యమైనంత వరకు తాజా ఆకుకూరలు, సీజనల్ ఫ్రూట్స్, పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, గ్రుడ్లు, తృణధాన్యాలు, డ్రై ఫ్రూట్స్ వంటి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు. ఆల్కహాల్, పొగాకు, పొగాకు ఉత్పత్తులు, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సీతారామయ్య, సురేష్, సుమన్ రెడ్డి, మంగపతి, విజయ్ కుమార్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కౌండిన్యశ్రీ, నందూరి వెంకటేశ్వర రాజు, హాస్పిటల్ ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉక్రెయిన్‌యూకే మధ్య 3.1 బిలియన్ డాలర్ల రుణ ఒప్పందం

**3.1 బిలియన్ డాలర్ల రుణ ఒప్పందాన్ని యూకే, ఉక్రెయిన్‌లు కుదుర్చుకున్నాయి.**

**ఇంటర్నెట్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తో వివాదం తర్వాత యూకే పర్యటనకు వెళ్లిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కి కొంత ఊరట లభించింది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 3.1 బిలియన్ డాలర్ల విలువైన రుణ ఒప్పందంపై ఇరుదేశాధినేతలు సంతకాలు చేశారు. ఈ నిధులను ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఉపయోగించనున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు.

‘యూకే ప్రధాని స్టార్మర్‌తో ఉక్రెయిన్ సహా యూరప్ మొత్తం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించా. కీవ్ బలోపేతం కావడంతోపాటు.. యుద్ధాన్ని ముగించేందుకు తీసుకోవాల్సిన చర్యలు కూడా మా మధ్య చర్చకు వచ్చాయి. మా రక్షణ సామర్థ్యాలను ఈ రుణ ఒప్పందం బలపరుస్తుంది. ఉక్రెయిన్‌లో ఆయుధ తయారీకి వీటిని ఉపయోగిస్తాం. యుద్ధం ప్రారంభం నుంచి అండగా ఉన్న యూకే ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు. ఇలాంటి వ్యూహాత్మక భాగస్వామి లభించడం మా అదృష్టం’ అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధంపై ఐరోపా దేశాధినేతలతో స్టార్మర్ ఏర్పాటు చేసిన సమావేశానికి జెలెన్‌స్కీ హాజరుకానున్నారు. ఈ పర్యటన వేళ బ్రిటన్ రాజు ఛార్లెస్‌తోనూ సమావేశమయ్యే అవకాశం ఉంది.

అంతకుముందు.. జెలెన్‌స్కీ లండన్‌లోని 10 డౌనింగ్ స్ట్రీట్‌కు చేరుకోగా స్టార్మర్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**మా సంపూర్ణ మద్దతు మీకే**

రష్యా చేస్తున్న యుద్ధానికి తెర దించేలా శాంతి ఒప్పందం కుదర్చడం, దానికి బదులుగా ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాల తవ్వకానికి అనుమతించాలని అమెరికా ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనిపై చర్చించేందుకు శ్వేతసౌధానికి వెళ్లిన జెలెన్‌స్కీ.. భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని అమెరికాపై ఒత్తిడి చేశారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. దీంతో వివాదాదం చోటు చేసుకొ చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. దీంతో ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండానే జెలెన్‌స్కీ వైట్‌హౌస్ నుంచి వెళ్లిపోయారు.



## లాండ్రీ రోబో.. ఉతికి ఆరేస్తుంది!

బట్టలు ఉతికే వాషింగ్ మెషిన్స్ వచ్చినా కూడా చాలామంది మురికి బట్టలను చేతితోనే ఉతుకుతుంటారు. పైగా బట్టలను వాషింగ్ మెషిన్‌లో లోడ్ చేయటం, ఉతికిన బట్టలను తిరిగి అన్‌లోడ్ చేసి ఆరేయటం అంతా మనమే చేసుకోవాలి. ఇప్పుడు ఈ సమస్యలన్నింటినీ దూరం చేస్తుంది ఈ రోబో.ఏఐ టెక్స్‌టైల్ ప్రాసెసింగ్, పాయింట్ క్లౌడ్ ఆధారిత అల్గారిథంతో తయారు చేసిన ఈ రోబో ఎలాంటి బట్టల మురికినైనా, చేతితో రుద్ది రుద్ది పోగొడుతుంది. తెల్ల బట్టలను ఒక రకంగా, రంగు పోయే దుస్తులను ఒక విధంగా ఇలా.. ఏ రకం దుస్తులను ఏ విధంగా ఉతకాలో ఆ విధంగానే ఉతుకుతుంది.

వాషింగ్ మెషిన్ కేవలం బట్టలను ఉతకడం మాత్రమే చేస్తుంది. కాని, ఈ రోబో బట్టలను ఆరేస్తుంది. ఆరేసిన బట్టలను మడతపెడుతుంది. ఆర్డర్ ఇస్తే ఇస్త్రీ కూడా చేస్తుంది. బాగుంది కదూ! త్వరలోనే మార్కెట్‌లోకి విడుదల కానుంది.




## మైక్రోసాఫ్ట్ కీలక నిర్ణయం...
## త్వరలో ఆ యాప్ షట్‌డౌన్!

ప్రపంచంలోనే మొట్టమొదటి వీడియో కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫామ్ 'స్కైప్' ను శాశ్వతంగా మూసివేయాలని, టెక్ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' యోచిస్తోంది. మే నుంచి స్కైప్ అందుబాటులో ఉండదని.. కంపెనీ వెల్లడించింది.

2003లో ప్రారంభమైన స్కైప్‌ను.. మైక్రోసాఫ్ట్ 2011లో 8.5 బిలియన్ డాలర్లకు (ప్రస్తుత కరెన్సీ ప్రకారం రూ. 74వేలకోట్లు) కొనుగోలు చేసింది. ఆ తరువాత ఇందులో అనేక అప్డేట్స్ తీసుకొచ్చింది. విండోస్ లైవ్ మెసెంజర్ తొలగింపు తరువాత.. 2015లో మైక్రోసాఫ్ట్ స్కైప్‌ను విండోస్ 10 లో అనుసంధానించడానికి ప్రయత్నించింది. ఇది మొత్తం తొమ్మిది నెలలు కొనసాగింది. అయితే ఇప్పుడు 22 ఏళ్ల స్కైప్ ప్రయాణానికి మంగళం పాడనుంది.మైక్రోసాఫ్ట్.. స్కైప్‌ను అభివృద్ధి చేయడానికి అనేక రకాలుగా పాటుపడింది. ఇందులో భాగంగానే యాపిల్ కంపెనీకి చెందిన 'ఐమెసేజ్'తో పోటీ పడటానికి సిద్ధమైంది. అయినా ఎలాంటి ఉపయోగం కనిపించలేదు. 2017లో మైక్రోసాఫ్ట్ టీమ్స్‌ను ప్రారంభించింది. ఎన్నెన్ని ప్రయత్నాలు చేసినా స్కైప్ అభివృద్ధి చెందలేదు. దీంతో చేసేదేమీ లేక.. కంపెనీ పూర్తిగా స్కైప్‌ను నిలిపివేయడానికి ఫిక్స్ అయింది. సంస్థ ఈ విషయాన్ని త్వరలోనే అధికారికంగా యూజర్లకు వెల్లడించనుంది.




## వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్

**అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వెల్లడి**

**న్యూయార్క్:** బలమైన ప్రైవేట్ పెట్టుబడులు, స్థూల ఆర్థిక స్థిరత్వం నేపథ్యంలో 2025-26లో 6.5 శాతం జీడీపీ వృద్ధిని సాధించడం ద్వారా.. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని నిలుపుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ తెలిపింది. భారత బలమైన ఆర్థిక పనితీరు 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలనే ఆశయాన్ని సాకారం చేసుకోవడానికి కీలక, సవాలుతో కూడిన నిర్మాణాత్మక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికి దేశానికి అవకాశాన్ని అందిస్తుందని వివరించింది.

నిరంతర స్థూల ఆర్థిక, ఆర్థిక స్థిరత్వం నేపథ్యంలో ప్రైవేట్ వినియోగంలో బలమైన వృద్ధితో 2024-25, 2025-26లో వాస్తవ జీడీపీ 6.5% పెరుగుతుందని అంచనా. ఇటీవలి కాలంలో ఆర్థిక వ్యవస్థలో నియంత్రణ ఉన్నప్పటికీ భారత ఆర్థిక వృద్ధి బలంగానే ఉంది. 2024-25 మొదటి అర్ధభాగంలో జీడీపీ వృద్ధి 6%గా ఉంది' అని వివరించింది.

**నిరర్థక రుణాలు తగ్గాయి..**

అధిక నాణ్యత ఉద్యోగాలను సృష్టించడానికి, పెట్టుబడులను ఉత్తేజపరిచేందుకు, అధిక వృద్ధి అవకాశాలను అందుకోవడానికి సమగ్ర నిర్మాణాత్మక సంస్కరణలు చాలా ముఖ్యమైనవని ఐఎంఎఫ్ తెలిపింది. 'కార్మిక మార్కెట్ సంస్కరణలను అమలు చేయడం, మానవ వనరుల బలోపేతం, శ్రామిక శక్తిలో మహిళల అధిక భాగస్వామ్యానికి మద్దతు ఇవ్వడంపై దృష్టి పెట్టాలి. ఆహార ధరల హెచ్చుతగ్గులు కొంత అస్థిరతను సృష్టించినప్పటికీ రిజర్వ్ బ్యాంక్ టాలరెన్స్ బ్యాండ్ (2 నుండి 6 శాతం) పరిధిలో ద్రవ్యోల్బణం విస్తృతంగా తగ్గింది. ఆర్థిక రంగం స్థితిస్థాపకంగానే ఉంది. నిరర్థక రుణాలు బహుళ సంవత్సరాల కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక ఏకీకరణ కొనసాగింది. సర్వీ సెస్ ఎగుమతుల్లో బలమైన వృద్ధి మద్దతు తో కరెంట్ ఖాతా లోటు చాలా అదుపులో ఉంది' అని వివరించింది.




# ఇకపై పాస్‌పోర్ట్ కావాలంటే..

**పాస్‌పోర్టుల జారీకి సంబంధించిన నిబంధనలలో భారత ప్రభుత్వం తాజాగా మార్పులు చేసింది. పాస్‌పోర్టుల జారీ కోసం సమర్పించే పుట్టినరోజు తేదీ రుజువుకు సంబంధించిన నిబంధనలకు సవరణలు ప్రకటిస్తూ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. పాస్‌పోర్ట్ (సవరణ) నిబంధనలు, 2025 లో భాగమైన ఈ మార్పులు పాస్‌పోర్ట్ దరఖాస్తు ప్రక్రియను క్రమబద్ధీకరించడం, అవసరమైన డాక్యుమెంటేషన్‌లో ఏకరూపతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.**

**నిబంధనల్లో కీలక మార్పులు**

2023 అక్టోబర్ 1 లేదా ఆ తర్వాత జన్మించిన పిల్లలకు జనన మరణాల రిజిస్ట్రార్, మునిసిపల్ కార్పొరేషన్ లేదా జనన, మరణాల నమోదు చట్టం, 1969 ప్రకారం అధికారం ఉన్న ఏదైనా ఇతర అథారిటీ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం మాత్రమే పుట్టిన తేదీకి చెల్లుబాటు అయ్యే రుజువు అని కొత్త నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ఈ మార్పు శిశువులకు జనన ధృవీకరణ పత్రాన్ని పొందాల్సిన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. అలాగే పుట్టిన తేదీని అధికారిక రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేలా చేస్తుంది.

**2023 అక్టోబర్ 1 కంటే ముందు పుట్టినవారికి..**

2023 అక్టోబర్ 1 కంటే ముందు జన్మించిన వారికి పుట్టిన తేదీకి సంబంధించి అనుమతించదగిన రుజువులు మరింత సరళంగా ఉంటాయి. ఈ కింది డాక్యుమెంట్లను డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్‌గా ఆమోదిస్తారు.

జనన మరణాల రిజిస్ట్రార్, మునిసిపల్ కార్పొరేషన్ లేదా జనన మరణాల నమోదు చట్టం, 1969 ప్రకారం అధికారం ఉన్న మరేదైనా అథారిటీ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం.

దరఖాస్తుదారు పుట్టిన తేదీని కలిగి ఉన్న గుర్తింపు పొందిన పాఠశాల లేదా గుర్తింపు పొందిన విద్యా బోర్డు జారీ చేసిన బదిలీ లేదా స్కూల్ లీవింగ్ లేదా మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్.

**దరఖాస్తుదారు పుట్టిన తేదీతో ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కార్డు.**

దరఖాస్తుదారు పుట్టిన తేదీ ఉండే సర్వీస్ రికార్డ్ ఎక్స్‌ట్రాక్ట్ లేదా వేతన పెన్షన్ ఆర్డర్ కాపీలు (ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తాయి). వీటికి సంబంధిత మంత్రిత్వ శాఖ లేదా దరఖాస్తుదారు అడ్మినిస్ట్రేషన్ ఇన్చార్జి అధికారి ధ్రువీకరణ ఉండాలి.

**దరఖాస్తుదారు పుట్టిన తేదీతో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్.**

దరఖాస్తుదారు పుట్టిన తేదీతో కూడిన ఎన్నికల సంఘం జారీ చేసిన ఎలక్షన్ ఫోటో ఐడీ కార్డు.

**దరఖాస్తుదారులపై ప్రభావం**

**కొత్త నిబంధనలు ప్రధానంగా 2023 అక్టోబర్ 1 లేదా తరువాత జన్మించిన పిల్లల తల్లిదండ్రులను ప్రభావితం చేస్తాయి. వారు పాస్‌పోర్ట్ దరఖాస్తులకు పుట్టిన తేదీ ఏకైక రుజువుగా జనన ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి ఉంటుంది. ఈ మార్పు డాక్యుమెంటేషన్ ప్రక్రియను ప్రామాణీకరించడం, పుట్టిన తేదీ రికార్డులలో వ్యత్యాసాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2023 అక్టోబర్ 1 కంటే ముందు జన్మించినవారిపై మాత్రం ఎటువంటి ప్రభావం ఉండదు. పాస్‌పోర్ట్ కోసం వారు ఎప్పటిలాగే వివిధ రకాల డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్‌లను సమర్పించవచ్చు.**







# ఎక్కువమంది ఆ బ్రాండ్ కార్లనే కొనేస్తున్నారు

- స్వల్పంగా పెరిగిన మారుతీ సుజుకీ సేల్స్
- మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా రెండంకెల వృద్ధి
- నెమ్మదించిన హ్యుందాయ్, టాటా మోటార్స్




**ముంబై**: వాహన కంపెనీల విక్రయాలు ఎగుమతులతో కలుపుకుని ఫిబ్రవరిలో ఆశాజనకంగా నమోదయ్యాయి. ప్యాసింజర్స్ వెహికిల్స్ తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ స్వల్ప వృద్ధితో సరిపెట్టుకుంది. డిమాండ్ స్తబ్దుగా ఉండడంతో హ్యుందాయ్, టాటా మోటార్స్ వాహన అమ్మకాలు నెమ్మదించాయి. ఎస్‌యూవీలు, ఎంపీవీ మోడళ్లకు గిరాకీ లభించడంతో మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్ మోటార్ వాహన విక్రయాలు గత నెలలో రెండంకెల వృద్ధి సాధించాయి.

మారుతీ సుజుకీ దేశీయంగా గత నెలలో 1,60,791 యూనిట్ల వాహనాలు విక్రయించింది. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సంఖ్య 1,60,271 యూనిట్లు. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్‌ప్రెస్సో విక్రయాలు 14,782 నుంచి 10,226 యూనిట్లకు తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వేగన్-ఆర్ అమ్మకాలు 71,627 నుంచి 72,942 యూనిట్లకు పెరిగాయి. యుటిలిటీ వాహన విభాగంలోని బ్రెజ్జా, గ్రాండ్ విటారా, ఎర్టిగా, ఎక్స్ఎల్6 విక్రయాలు 61,234 నుంచి 65,033 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు కలుపుకొని ఈ ఫిబ్రవరిలో కంపెనీ 1,99,400 యూనిట్ల వాహనాలు విక్రయించింది.

- హ్యుండై మోటార్ ఇండియా మొత్తం వాహన విక్రయాలు 3% క్షీణించి 58,727 యూనిట్లకు వచ్చి చేరాయి. దేశీయంగా భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ.. కేంద్ర బడ్జెట్ 2025లో ప్రతిపాదిత పన్ను సంస్కరణలు, మెరుగైన ద్రవ్య లభ్యత మార్కెట్‌కు అవసరమైన డిమాండ్‌ను అందిస్తాయని ఆశావాదంగా ఉన్నాం' అని కంపెనీ సీఈవో తరుణ్ గర్గ్ అన్నారు.
- టాటా మోటార్స్ మొత్తం వాహన విక్రయాలు 8% తగ్గి 77,232 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- ఎస్‌యూవీలకు డిమాండ్ లభించడంతో ఎంఅండ్ఎం మొత్తం అమ్మకాల్లో 15% వృద్ధి నమోదై 83,072 యూనిట్లకు చేరుకున్నాయి.



# 'అలాంటి వీడియోలతో జాగ్రత్త.. నాకు ఎలాంటి సంబంధం లేదు'

బాలీవుడ్ విద్యా బాలన్ గతేడాది భూల్ భూలయ్యా3 మూవీతో అభిమానులను అలరించింది. ఈ హారర్ కామెడీ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ కీలక పాత్రల్లో మెప్పించారు. భూల్ భూలయ్యా సిరీస్‌లో వచ్చిన ఈ మూడో చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే విద్యా బాలన్ తాజాగా సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో పెద్దఎత్తున తనకు సంబంధించిన వీడియోలపై ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టింది. అవన్నీ ఫేక్ అనీ.. కేవలం ఏఐ సాయంతో రూపొందించారని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఓ వీడియోను రిలీజ్ చేసింది. వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని.. తప్పుదారి పట్టించేలా ఉన్న వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నా అని తెలిపింది.విద్యాబాలన్ తన పోస్ట్‌లో రాస్తూ.. 'నేను మీకు ఇష్టమైన విద్యాబాలన్. ప్రస్తుతం సోషల్ మీడియా, వాట్సాప్‌లో అనేక వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయి. అంతేకాకుండా అవీ నన్ను టార్గెట్ చేసేలా ఉన్నాయి. అయితే ఆ వీడియోలు ఏఐ సాయంతో రూపొందించినవి. అవన్నీ ఫేక్ అని నేను స్పష్టం చేయాలనుకుంటున్నా. వాటిని క్రియేట్ చేయడం, వ్యాప్తి చేయడంలో నాకు ఎలాంటి సంబంధం లేదు. అలాంటి కంటెంట్‌ను నేను ఏ విధంగానూ ఆమోదించను. వీడియోలలో చేసిన వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఎందుకంటే ఇలాంటివీ నా అభిప్రాయాలు, నా పనిని ప్రభావితం చేయలేవు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని షేర్ చేసేముందు ధృవీకరించుకోండి. ఎందుకంటే ఏఐ సాయంతో రూపొందించిన కంటెంట్ మిమ్మల్ని తప్పుదారి పట్టిస్తుంది. ఇలాంటివాటితో జాగ్రత్తగా ఉండాలని నేను ప్రతి ఒక్కరినీ కోరుతున్నా.' అని రాసుకొచ్చింది. కాగా.. గతంలో విద్యాబాలన్ కంటేముందే రష్మిక మందన్న, దీపికా పదుకొణె, అలియా భట్, కత్రినా కైఫ్, రణ్‌వీర్ సింగ్, అమీర్ ఖాన్ లాంటి స్టార్స్ సైతం డీప్‌ఫేక్ వీడియోల బారిన పడిన సంగతి తెలిసిందే.



# మైసూర్ టూ ఢిల్లీ.. పార్లమెంట్‌లో కీలక సన్నివేశాలు!

గేమ్ ఛేంజర్ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న చిత్రం ఆర్సీ16. ఈ మూవీకి ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కొద్ది రోజుల క్రితమే సెట్‌లోని ఫోటోలను కూడా సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు చెర్రీ. తన కూతురు క్లీంకారతో ఉన్న ఫోటోలను పంచుకున్నారు. ప్రస్తుతం ఆర్సీ16 మూవీ షూటింగ్ షెడ్యూల్ మైసూరులో జరుగుతోన్న సంగతి తెలిసిందే.
మైసూరు షెడ్యూల్‌లో రామ్ చరణ్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ షెడ్యూల్ దాదాపుగా ముగిసినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రామ్ చరణ్ మూవీ టీమ్ ఢిల్లీకి షిఫ్ట్ అవుతున్నట్లు సమాచారం. ఢిల్లీలోని పార్లమెంట్‌లో మరిన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాకుడా జామా మసీదు ప్రాంతంలోనూ షూట్ చేయనున్నారని టాక్. షూటింగ్ అనుమతులకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు తెలుస్తోంది. మార్చి 4న పార్లమెంట్‌లో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది.
కాగా.. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు పెద్ది అనే టైటిల్ ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో దేవర భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ నెల 27న రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా టీజర్ విడుదలయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



# సీక్రెట్ బయటపెట్టిన స్టార్ హీరోయిన్

**ఒకప్పుడు మందు తాగడం అంటే ఏదో పెద్ద తప్పులా చూసేవాళ్లు. కానీ ఇప్పుడు చాలామందికి అలవాటు ఉండే ఉంటుంది. కాకపోతే బయటకు చెప్పకోవడానికి పెద్దగా ఇష్టపడరు. సెలబ్రిటీలైతే ఈ విషయంలో బయటపడరు. ఓ టాలీవుడ్ హీరోయిన్ మాత్రం తనకు తాగే అలవాటుందని చెప్పకొచ్చింది.**



సంయుక్త మీనన్ మలయాళీ అనే సంగతి అందరికీ తెలుసు. కానీ తండ్రి నుంచి విడిపోయిన తర్వాత మీనన్ అనే ఇంటి పేరు తొలగించుకుంది.
ట్రావెలింగ్ అంటే పిచ్చి. షూటింగ్ రీత్యా రకరకాల ప్రదేశాలు తిరిగినా, పర్సనల్ ట్రావెల్ ప్రిఫర్ చేస్తుంటుంది. ఈ ప్రయాణాల్లో ప్రకృతి సౌందర్యంతో పాటు ఆధ్యాత్మిక విశిష్టత ఉన్న ప్రాంతాలకు వెళ్తుంటుంది. కుంభమేళాకు కూడా వెళ్లి పవిత్ర స్నానాలు చేసి వచ్చింది.
సంయుక్త మంచి ఫుడ్ లవర్ . కేరళ స్టయిల్ వంటకాలంటే ప్రాణం. సినిమాల్లో కూడా ఆయా ప్రాంతాల ప్రత్యేక వంటకాలు తెలియ చేసే సినిమాలు రావాలంటుంది.
తెలుగులో ఉలవచారు బిర్యానీ సినిమా వచ్చిందిగా అంటే.. అది మలయాళ పెప్పర్ సాల్ట్ సినిమా రీమేకేగా అంటుంది. ఏ విషయం అయినా, బోల్డ్‌గా చెప్పేయడం సంయుక్త అలవాటు. తను అప్పుడప్పుడు ఆల్కహాల్ తీసుకుంటానని ఓపెన్‌గా చెప్పేసింది. అయితే అన్ని పార్టీల్లో కాదు.. క్లోజ్ ఫ్రెండ్స్‌తో పార్టీ చేసుకున్నప్పుడేనని చెప్పింది.
తెలుగు సినిమాల్లో హీరోయిన్లని గ్లామరస్‌గా చూపించినా, సెట్స్ బయట తెలుగు సినిమా పరిశ్రమ లేడీ ఆర్టిస్టులతో ప్రవర్తించినంత మర్యాదగా.. మరే భాషా రంగం ఉండదని అభిప్రాయం వ్యక్తం చేసింది.
కో -ఆర్టిస్టుల పెర్ఫార్మెన్స్‌తోనే తను కూడా పోటీ పడి నటించగలనని, అవతల ఆర్టిస్టు డమ్మీ అయితే తను కూడా నీరు కారిపోతానని సంయుక్త చెప్పుకొచ్చింది. అందుకే విరూపాక్ష, సార్, బింబిసార లాంటి సినిమాలు అంత సూపర్ హిట్ అయ్యాయని చెప్పింది.
పుస్తకాల పురుగు. ఫిక్షన్ నవలలు ఎంత ఇష్టమో, భారతీయ సంస్కృతిని తెలియచేసే బుక్స్ అన్నా అంతే అభిమానం.
నందమూరి బాలకృష్ణతో ఓ జ్యుయెలరీ యాడ్ లో యాక్ట్ చేసినప్పుడు - ఆయనతో నటించే ఛాన్స్ ఎప్పుడు వస్తుందా అనుకుందట. కానీ అఖండ-2లో ఆఫర్ వచ్చేటప్పటికీ ఆ ఎగ్జయిట్‌మెంట్ మాటల్లో వర్ణించలేను అంది.
తను చేయబోతున్న ఓ హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమా కోసం ఫిజికల్ ఫిట్నెస్ కోసం స్పెషల్ ట్రైనింగ్ తీసుకుంటోంది.

# నాగచైతన్య సినిమాతో ఎంట్రీ.. సమంతకు అరుదైన గౌరవం

టాలీవుడ్ హీరోయిన్ సమంత గతేడాది ఇండియన్ వర్షన్ వెబ్ సిరీస్ సిటాడెల్ : హనీ బన్నీలో కనిపించింది. అయితే కొత్త ఏడాదిలో ఎలాంటి ప్రాజెక్ట్‌ను ప్రకటించలేదు. ఒకప్పుడు దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్‌లో రీ ఎంట్రీకి మాత్రం నానా తంటాలు పడుతోంది. తెలుగులో అవకాశాలు రాకపోవడంతో తన సొంత బ్యానర్‌లోని మా ఇంటి బంగారం పేరుతో ఓ సినిమాను నిర్మిస్తోంది. అయితే తాజాగా సమంతను ఓ అవార్డ్ వరించింది. సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన 15 ఏళ్లు పూర్తి కావడంతో ప్రముఖ సంస్థ ఆమెను సత్కరించింది. చెన్నైకి చెందిన ఎంసీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధులు సమంతకు అవార్డ్‌ను అందజేశారు. బిహైండ్‌వుడ్స్ గోల్డ్ అందించే హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డ్‌కు ఆమెకు అందించారు. చెన్నైలో జరిగిన వేడుకలో సమంత ఈ అవార్డ్‌ను అందుకుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది సామ్. అంతేకాకుండా సిటాడెల్ వెబ్ సిరీస్‌కు కూడా మరో అవార్డ్‌ను అందుకుంది ఈ ముద్దగుమ్మ.
కాగా.. సమంత 2010లో అక్కినేని నాగచైతన్య సరసన ఏ మాయ చేసావే అనే సినిమాతో తొలిసారిగా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వత పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించింది. టాలీవుడ్ అగ్రహీరోల సరసన నటించి ప్రశంసలు అందుకుంది. సామ్ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టి 15 ఏళ్లు పూర్తి కావడంతో అవార్డ్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సిటాడెల్ హనీ బన్నీ డైరెక్టర్స్ రాజ్ నిడిమోరు, డీకే కూడా హాజరయ్యారు.

**రాజ్ నిడిమోరుతో డేటింగ్ వార్తలు**

కాగా.. ఇటీవల రాజ్ నిడిమోరుతో డేటింగ్ ఉందంటూ సమంతపై వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. చెన్నైలో జరిగిన పికిల్ బాల్ టోర్నమెంట్‌లో వీరిద్దరు జంటగా కనిపించడంతో మరోసారి రూమర్స్ వినిపించాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి సమంత, రాజ్ నిడిమోరు ఓకే వేదికపై మెరిశారు. దీంతో మరోసారి సమంతపై డేటింగ్ రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై ఇప్పటికే సామ్ కానీ.. రాజ్ నిడిమోరు కానీ స్పందించలేదు.

# కొత్త సినిమా ఎప్పుడు.. ఎవరితో ఫస్ట్?



'పుష్ప 2' వచ్చి మూడు నెలలు దాటేసింది. అల్లు అర్జున్ ఇప్పుడు ఏ సినిమా.. ఎవరితో చేస్తాడనేది మాత్రం ఇంకా సస్పెన్స్ గానే ఉంది. ఎందుకంటే ఇద్దరి డైరెక్టర్ల పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అసలింతకీ ఏంటి సమస్య? ఎవరితో ఫస్ట్ చేయొచ్చు?
అల్లు అర్జున్ తో సినిమాలు చేసేందుకు చాలామంది దర్శకులు రెడీగా ఉన్నారు కానీ ఇదివరకే త్రివిక్రమ్ తో సినిమా చేసేందుకు బన్నీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. పీరియాడిక్ సెటప్ ఉన్న కథ కావడంతో ప్రీ ప్రొడక్షన్‌కే చాలా టైమ్ పట్టేలా ఉంది. నిర్మాత నాగవంశీ.. రీసెంట్ గానే మాట్లాడుతూ ఈ ఏడాది ద్వితియార్థంలో ప్రాజెక్ట్ మొదలవుతుందని క్లారిటీ ఇచ్చారు. అంటే మరో ఆరేడు నెలలు బన్నీ ఖాళీగానే ఉంటాడు.
మరోవైపు అల్లు అర్జున్.. తమిళ డైరెక్టర్ అట్లీతో సినిమా చేసేందుకు రెడీగా ఉన్నాడని ఇండస్ట్రీలో టాక్. కాకపోతే బడ్జెట్ రెమ్యునరేషన్ దగ్గరే చిక్కంతా వచ్చి పడిందని తెలుస్తోంది. రూ.600 కోట్ల బడ్జెట్ కాగా.. పారితోషికం కింద తనకే రూ.100 కోట్లు ఇవ్వాలని అట్లీ అంటున్నాడట. ఈ పాయింట్ దగ్గరే డిస్కసన్స్ నడుస్తున్నాయని, ఏదో ఒక విషయం తేలితో త్వరలో బన్నీఅట్లీ కాంబోపై క్లారిటీ వస్తుందని టాక్.
అట్లీ ప్రాజెక్ట్ ఓకే అయితే మాత్రం త్రివిక్రమ్ తో చేయాల్సిన సినిమా వచ్చే ఏడాదే మొదలవుతుంది. లేదంటే మాత్రం ఈ ఏడాది చివర్లో షురూ చేసేస్తారు. మరి బన్నీ ఏం చేస్తాడనేది చూడాలి?

# ఎవరికీ సాధ్యం కాని ఘనతను సొంతం చేసుకున్న న్యూజిలాండ్ బౌలర్



**ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా భారత్, న్యూజిలాండ్ జట్లు ఇవాళ (మార్చి 2) తలపడుతున్నాయి. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పేసర్ మ్యాట్ హెన్రీ చెలరేగిపోయాడు. ఐదు వికెట్ల ప్రదర్శనతో సత్తా చాటాడు. తద్వారా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. అలాగే ఈ మెగా టోర్నీలో భారత్‌పై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు (8-0-42-5) నమోదు చేసిన కివీస్ బౌలర్‌గానూ రికార్డుల్లోకెక్కాడు.**

**ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌పై అత్యుత్తమ గణాంకాలు**

5/42 మాట్ హెన్రీ, 2025
4/25 నవీద్‌ఉల్‌హసన్, 2004
4/36 షోయబ్ అక్తర్, 2004
4/62 డగ్లస్ హోండో, 2002

ఈ మ్యాచ్‌లో హెన్రీ కీలకమైన శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, హార్దిక్ పాండ్యా వికెట్లతో పాటు రవీంద్ర జడేజా, మహ్మద్ షమీ వికెట్లు తీశాడు. స్కోర్ 15 పరుగుల వద్ద ఉండగానే గిల్‌ను ఔట్ చేసిన హెన్రీ భారత్‌ను తొలి దెబ్బ తీశాడు. అనంతరం గత మ్యాచ్ సెంచరీ హీరో విరాట్‌ను ఔట్ చేసి టీమిండియా కష్టాలను మరింత అధికం చేశాడు.

ఇన్నింగ్స్ చివర్లో ధాటిగా ఆడుతున్న హార్దిక్‌ను ఔట్ చేసి భారత్ భారీ స్కోర్ చేయకుండా కళ్లెం వేశాడు. ఒక్కో పరుగు కీలకమైన తరుణంలో స్ట్రయిక్ రొటేట్ చేస్తున్న రవీంద్ర జడేజాను ఔట్ చేశాడు. చివరిగా షమీని ఔట్ చేసి కెరీర్‌లో మూడో ఐదు వికెట్ల ఘనతను నమోదు చేశాడు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. మ్యాట్ హెన్రీ చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42), హార్దిక్ పాండ్యా (45) మాత్రమే రాణించారు. భారత టాప్3 బ్యాటర్లు విఫలమయ్యారు.

రోహిత్ శర్మ 15, శుభ్‌మన్ గిల్ 2, విరాట్ కోహ్లి 11 పరుగులు చేశారు. మధ్యలో కేఎల్ రాహుల్ (23) కాసేపు నిలకడగా ఆడాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా 16, షమీ 5 పరుగులకు ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్, విలియమ్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు.

అనంతరం 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ కష్టాల్లో ఉంది. ఆ జట్టు 37 ఓవర్ల అనంతరం సగం వికెట్లు కోల్పోయి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ గెలవాలంటే 78 బంతుల్లో 91 పరుగులు చేయాలి. చేతిలో 5 వికెట్లు మాత్రమే ఉన్నాయి. కేన్ విలియమ్సన్ (76) క్రీజ్‌లో పాతుకుపోయాడు.

భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 2, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీశారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో విల్ యంగ్ 22, రచిన్ రవీంద్ర 6, డారిల్ మిచెల్ 17, టామ్ లాథమ్ 14, గ్లెన్ ఫిలిప్స్ 12 పరుగులు చేసి ఔటయ్యారు. విలియమ్సన్‌కు జతగా బ్రేస్‌వెల్ క్రీజ్‌లో ఉన్నాడు.



# టీమిండియా మేనేజర్ ఇంట విషాదం

**ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో పాల్గొంటున్న భారత క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్న ఆర్ దేవరాజ్ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. దేవరాజ్ తల్లి కమలేశ్వరి ఇవాళ (మార్చి 2) ఉదయం మృతి చెంచారు. దీంతో దేవరాజ్ భారత బృందాన్ని వదిలి హైదరాబాద్‌కు బయల్దేరారు. దేవరాజ్ తిరిగి టీమిండియాతో కలుస్తారా లేదా అన్నది అస్పష్టంగా ఉంది. మంగళవారం జరిగే సెమీఫైనల్ ఫలితంపై ఈ విషయం ఆధారపడి ఉంటుంది.**

దేవరాజ్ ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. దేవరాజ్ తల్లి మృతి పట్ల హెచ్‌సీఏ సంతాపం వ్యక్తం చేసింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఓ ప్రకటనలో తెలిపింది. దేవరాజ్ ఇటీవలే టీమిండియా మేనేజర్ ఎంపికయ్యారు.

ఇదిలా ఉంటే, టీమిండియా ప్రస్తుతం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో న్యూజిలాండ్‌తో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. మ్యాట్ హెన్రీ (8042 5) చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42), హార్దిక్ పాండ్యా (45) మాత్రమే రాణించారు.

భారత టాప్3 బ్యాటర్లు విఫలమయ్యారు. రోహిత్ శర్మ 15, శుభ్‌మన్ గిల్ 2, విరాట్ కోహ్లి 11 పరుగులు చేశారు. మధ్యలో కేఎల్ రాహుల్ (23) కాసేపు నిలకడగా ఆడాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా 16, షమీ 5 పరుగులకు ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్, విలియమ్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు.

కాగా, గ్రూప్‌ఏలో భారత్, న్యూజిలాండ్ ఇదివరకే సెమీస్‌కు చేరడంతో ఈ మ్యాచ్ నామమాత్రంగా జరుగుతుంది. గ్రూప్‌బి నుంచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సెమీస్‌కు చేరాయి. ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్‌లో ఏ జట్టును ఢీకొట్టబోతుందో తెలుస్తుంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓడితే సెమీస్‌లో సౌతాఫ్రికాతో తలపడుతుంది. అదే గెలిస్తే ఆస్ట్రేలియాను ఢీకొట్టాల్సి ఉంటుంది.



# న్యూజిలాండ్‌పై విజయం..



# ఆసీస్‌తో భారత్ సెమీస్ మ్యాచ్

**ఛాంపియన్స్ ట్రోఫీ లో లీగ్ దశను టీమ్‌ఇండియా ఓటమి లేకుండా ముగించింది.**

**దుబాయ్:** ఛాంపియన్స్ ట్రోఫీ లో లీగ్ దశను టీమ్‌ఇండియా ఓటమి లేకుండా ముగించింది. ఇప్పటికే సెమీస్ చేరిన భారత జట్టు.. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్ ఎలో అగ్రస్థానంలో నిలిచిన టీమ్‌ఇండియా.. మంగళవారం (మార్చి 4) జరిగే తొలి సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడనుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్..నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో భారత స్పిన్నర్ల ధాటికి న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ (81; 120 బంతుల్లో 7 ఫోర్లు) ఒక్కడే పోరాడాడు. మిచెల్ శాంట్నర్ (28), విల్ యంగ్ (22), డారిల్ మిచెల్ (17), టామ్ లేథమ్ (14), గ్లెన్ ఫిలిప్స్ (12) పరుగులు చేశారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన రెండో వన్డేలోనే ఐదు వికెట్ల ప్రదర్శనతో (5/42) అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్ 2, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ పడగొట్టారు.

**భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ (79; 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అక్షర్ పటేల్ (42; 61 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చివర్లో హార్దిక్ పాండ్య (45; 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. కేఎల్ రాహుల్ (23), రవీంద్ర జడేజా (16) పరుగులు చేశారు. రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (2), విరాట్ కోహ్లి (11) నిరాశపర్చడంతో భారత్ 30 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో శ్రేయస్, అక్షర్ పటేల్ టీమ్‌ఇండియాను ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. చివర్లో హార్దిక్ మెరుపులు మెరిపించడంతో భారత్ పోరాడే స్కోరు సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5, జేమీసన్, విలియం ఓరూర్క్, శాంట్నర్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ తీశారు**



## భారత జట్టులో సహజ, శ్రీవల్లి

**న్యూఢిల్లీ:** మహిళల టెన్నిస్ టీమ్ ఈవెంట్ బిల్లీ జీన్ కింగ్ కప్‌లో పాల్గొనే భారత జట్టులో తెలుగమ్మాయిలు సహజ యామలపల్లి, భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఎంపికయ్యారు. అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సెలక్షన్ కమిటీ ఈ టోర్నీ కోసం ఐదుగురు సభ్యుల జట్టును శనివారం ప్రకటించింది. ఇందులో సహజ, శ్రీవల్లిలతో పాటు భారత నంబర్‌వన్ ర్యాంకర్ అంకిత రైనా, వైదేహి చౌదరి, ప్రార్థన తొంబరే ఉన్నారు.

ఇటీవల ముంబైలో జరిగిన డబ్ల్యూటీఏ టోర్నీలో సంచలన ప్రదర్శన కనబరిచిన మాయ రాజేశ్వరన్‌ను రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక చేశారు. ఈ టీమ్‌కు విశాల్ ఉప్పల్ నాన్‌ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. పురుషుల విభాగంలో జరిగే ప్రతిష్టాత్మక డేవిస్ కప్ టోర్నమెంట్‌లాగే మహిళల ఈవెంట్‌లో జరిగే టోర్నీయే ఈ 'బిల్లీ జీన్ కింగ్ కప్'. ఈ సారి ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వబోతోంది. పుణేలోని దక్కన్ జింఖానా కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 8 నుంచి బిల్లీ జీన్ కింగ్ కప్ పోటీలు జరుగుతాయి.

# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లి.. ఎవరికీ సాధ్యం కాని ఘనత సొంతం

**టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఖాతాలో మరో వరల్డ్ రికార్డు చేరింది. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో భాగంగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌తో 300 వన్డేల మైలురాయిని తాకిన విరాట్.. అంతర్జాతీయ క్రికెట్‌లో 300 వన్డేలు, 100కు పైగా టెస్ట్‌లు, 100కు పైగా టీ20లు ఆడిన ఏకైక క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రపంచంలో ఏ ఇతర క్రికెటర్ ఈ ఘనత సాధించలేదు.**



**కాగా, గ్రూప్-ఏలో భారత్, న్యూజిలాండ్ ఇదివరకే సెమీస్‌కు చేరడంతో ఈ మ్యాచ్ నామమాత్రంగా జరుగుతుంది. గ్రూప్-బి నుంచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా సెమీస్‌కు చేరాయి. ఈ మ్యాచ్ ఫలితంతో భారత్ సెమీస్‌లో ఏ జట్టును ఢీకొట్టబోతుందో తెలుస్తుంది. ఒకవేళ ఈ మ్యాచ్‌లో టీమిండియా ఓడితే సెమీస్‌లో సౌతాఫ్రికాతో తలపడుతుంది. గెలిస్తే ఆస్ట్రేలియాను ఢీకొట్టాల్సి ఉంటుంది**

విరాట్ ఇప్పటివరకు 300 వన్డేలు, 123 టెస్ట్‌లు, 125 టీ20లు ఆడాడు. భారత్ తరపున 300 వన్డేలు ఆడిన ఏడో క్రికెటర్‌గా, ఓవరాల్‌గా 22వ ఆటగాడిగానూ విరాట్ రికార్డుల్లోకెక్కాడు. విరాట్‌కు ముందు సచిన్ టెండూల్కర్ (463), ఎంఎస్ ధోని (350), రాహుల్ ద్రవిడ్ (344), మహ్మద్ అజారుద్దీన్ (334), సౌరవ్ గంగూలీ (311), యువరాజ్ సింగ్ (304) భారత్ తరపున 300 వన్డేల మైలురాయిని తాకారు.

కాగా, విరాట్ తన 300 వన్డేలో కేవలం 11 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. గ్లెన్ ఫిలిప్స్ నమ్మశక్యం కాని క్యాచ్‌తో విరాట్‌ను పెవిలియన్‌కు పంపాడు. గత మ్యాచ్‌లో విరాట్ పాకిస్తాన్‌పై సూపర్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో విరాట్ 52 పరుగులు చేసుంటే ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కేవాడు. ఈ రికార్డు శిఖర్ ధవన్ పేరిట ఉంది. ధవన్ ఛాంపియన్స్ ట్రోఫీలో 13 మ్యాచ్‌లు ఆడి 701 పరుగులు చేశాడు. ప్రస్తుతం (ఈ మ్యాచ్‌తో కలుపుకుని) విరాట్ ఖాతాలో 662 పరుగులు ఉన్నాయి (ఛాంపియన్స్ ట్రోఫీలో).

ఓవరాల్‌గా విరాట్ వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. వన్డేల్లో సచిన్ (18426), సంగక్కర (14234) మత్రమే విరాట్ కంటే ఎక్కువ పరుగులు చేశారు. విరాట్ ఇప్పటివరకు 288 ఇన్నింగ్స్‌లు ఆడి 14096 పరుగులు చేశాడు. విరాట్ ఇటీవలే వన్డేల్లో అత్యంత వేగంగా 14000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. పాక్‌పై సెంచరీతో వన్డేల్లో విరాట్ సెంచరీల సంఖ్య 51కి చేరింది. ప్రపంచ క్రికెట్‌లో ఇన్ని సెంచరీలు (50కిపైగా) ఎవరూ చేయలేదు.

మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. మ్యాట్ హెన్రీ (8042 5) ఐదేయడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత ఇన్నింగ్స్‌లో శ్రేయస్ అయ్యర్ (79), అక్షర్ పటేల్ (42), హార్దిక్ పాండ్యా (45) రాణించారు. భారత టాప్3 బ్యాటర్లు విఫలమయ్యారు.

రోహిత్ శర్మ 15, శుభ్‌మన్ గిల్ 2, విరాట్ కోహ్లి 11 పరుగులు చేశారు. అక్షర్ పటేల్ ఔటయ్యాక కేఎల్ రాహుల్ (23) శ్రేయస్‌తో కలిసి కాసేపు నిలకడగా ఆడాడు. ఆఖర్లో రవీంద్ర జడేజా 16, షమీ 5 పరుగులకు ఔటయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్, విలియమ్ రూర్కీ, మిచెల్ సాంట్నర్, రచిన్ రవీంద్ర తలో వికెట్ తీశారు..

# కరుణ్ నాయర్ సూపర్ సెంచరీ.. రంజీ ఛాంపియన్‌గా విదర్భ

**రంజీ ట్రోఫీ 2024-25 ఎడిషన్ ఛాంపియన్‌గా విదర్భ అవతరించింది. కేరళతో జరిగిన ఫైనల్ డ్రాగా ముగిసినప్పటికీ.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విదర్భ విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో అత్యంత కీలకమైన 37 పరుగుల ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ స్కోర్‌ను క్రాస్ చేయలేకపోవడంతో తొలి సారి రంజీ ఫైనల్‌కు చేరిన కేరళ రన్నరప్‌తో సరిపెట్టుకుంది.**




విదర్భ రంజీల్లో తమ మూడో టైటిల్‌ను సొంతం చేసుకుంది. విదర్భ 201718, 201819 ఎడిషన్లలో వరుసగా రంజీ ఛాంపియన్‌గా నిలిచింది. గత ఎడిషన్‌లోనూ ఫైనల్‌కు చేరిన విదర్భ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గత సీజన్ ఫైనల్లో విదర్భ ముంబై చేతిలో ఓడింది. మ్యాచ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్‌లో విదర్భ రెండు ఇన్నింగ్స్‌లు బ్యాటింగ్ చేయగా..కేరళ ఒకే ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులకు ఆలౌటైంది.

యువ ఆటగాడు దనిశ్ మలేవార్ (153) సూపర్ సెంచరీతో కదంతొక్కగా.. స్టార్ ఆటగాడు కరుణ్ నాయర్ (86) సెంచరీకి చేరువలో రనౌటయ్యాడు. విదర్భ ఇన్నింగ్స్‌లో వీరిద్దరు మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. 11వ నంబర్ ఆటగాడు నచికేత్ భూటే (32) మలేవార్, కరుణ్ నాయర్ తర్వాత టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

ధృవ్ షోరే (16), యశ్ ఠాకూర్ (25), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (23), అక్షయ్ కర్నేవార్ (12), హర్ష్ దూబే (12 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేయగా.. పార్థ్ రేఖడే (0), దర్శన్ నల్కండే (1), యశ్ రాథోడ్ (3) పూర్తిగా నిరాశపరిచారు. కేరళ బౌలర్లలో నిదీశ్, ఈడెన్ యాపిల్ తలో 3 వికెట్లు పడగొట్టగా.. బాసిల్ 2, జలజ్ సక్సేనా ఓ వికెట్ దక్కించుకున్నారు.

అనంతరం బరిలోకి దిగిన కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌటైంది. ఫలితంగా విదర్భ 37 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. కేరళ ఇన్నింగ్స్‌లో ఆదిత్య సర్వటే (79), సచిన్ బేబి (98) సత్తా చాటగా.. అహ్మద్ ఇమ్రాన్ (37), మహ్మద్ అజాహరుద్దీన్ (34), సల్మాన్ నిజర్ (21), జలజ్ సక్సేనా (28) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అక్షయ్ చంద్రన్ (14), రోహన్ కన్నుమ్మల్ (0), ఏడెన్ యాపిల్ టామ్ (10), నిధీశ్ (1) నిరాశపరిచారు. విదర్భ బౌలర్లలో దర్శన్ నల్కండే, పార్థ్ రేఖడే, హర్ష్ దూబే తలో 3 వికెట్లు పడగొట్టగా.. యశ్ ఠాకూర్ ఓ వికెట్ దక్కించుకున్నాడు.

**సూపర్ సెంచరీతో మెరిసిన కరుణ్**

37 పరుగుల లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ మిస్ అయిన కరుణ్ నాయర్ ఈ ఇన్నింగ్స్‌లో సూపర్ సెంచరీతో (135) మెరిశాడు. కరుణ్‌కు ఈ రంజీ సీజన్‌లో ఇది నాలుగో సెంచరీ. ఓవరాల్‌గా ఈ దేశవాలీ సీజన్‌లో 9వది. ఈ సీజన్ విజయ్ హజారే ట్రోఫీలో కరుణ్ ఐదు సెంచరీలు చేశాడు.

**రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించిన మలేవార్**

తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో దనిశ్ మలేవార్ (73) రెండో ఇన్నింగ్స్‌లోనూ అర్ధ సెంచరీతో రాణించాడు. ఐదో రోజు ఆట చివరి సెషన్‌లో దర్శన నల్కండే (51 నాటౌట్) కేరళ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. కేరళ బౌలర్లలో ఆదిత్య సర్వటే 4 వికెట్లు తీయగా.. నిధీశ్, జలజ్, యాపిల్ టామ్, బాసిల్, అక్షయ్ చంద్రన్ తలో వికెట్ పడగొట్టారు.

**ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా హర్ష్ దూబే**

ఈ రంజీ సీజన్‌లో 10 మ్యాచ్‌ల్లో 68 వికెట్లు తీసిన విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబేకు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీమెంట్ అవార్డు లభించింది. ఈ ప్రదర్శనతో హర్ష్ ఒకే సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. ఈ సీజన్‌లో హర్ష్ 7 ఐదు వికెట్ల ప్రదర్శనలు.. 3 నాలుగు వికెట్ల ప్రదర్శనలు నమోదు చేశాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ, రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ చేసిన దనిశ్ మలేవార్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.